స్వాతంత్ర్య వేడుకలకు అంతా సిద్ధం

సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

పోలీస్ మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు ఎస్పీ సంజీవరావ్

- జిల్లా పరేడ్ మైదనంలో వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి/సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 14: స్వాతంత్ర్య వేడుకలకు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఆ పనులను అదనపు ఎస్పీ సంజీవరావ్ పర్యవేక్షించారు. గురువారం ఉదయం 9.15 గంటలకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 9.35 గంటల వరకు మంత్రి సందేశం, 9.35 నుంచి 10 గంటల వరకు శకటాల ప్రదర్శన, 10 నుంచి 10.45 గంటల వరకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రశంసా పత్రాల పంపిణీ, 11.15 నుంచి 11.45 గంటల వరకు మంత్రితోపాటు అతిథితులు, ఆహ్వానితులు స్టాళ్లను సందర్శిస్తారు. వర్షం నుంచి రక్షణకు ప్రత్యేకంగా వాటర్ ప్రూఫ్ షామీయానాలను ఏర్పాటుచేశారు. వీఐపీలు, ఉన్నాతాధికారులు, పలు సంఘాల ప్రతినిధులు, మాజీ సైనిక కుటుంబీకులు, విద్యార్థులకు అనుగుణంగా గ్రౌండ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అమరుల కుటుంబాలు నివాళులర్పించే స్థూపాన్ని పూలతో అలంకరించారు. శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకొని డాగ్‌స్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మజీ సర్పంచ్‌కు పరామర్శ

మనూరు, ఆగస్టు 14: మాజీ సర్పంచ్ రాజేందర్‌రావును నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మండల పరిధిలోని ఉసిరికెపల్లి మాజీ సర్పంచ్ రాజేందర్ రావు అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మాజీ సర్పంచ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన కూతురు శ్రేయారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, కోఆప్షన్ సభ్యుడు సలీం, సిద్దన్న, కిషన్ రావు, ఖదీర్, సంతోష్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రత్నప్రసాద్

సదాశివపేట, ఆగస్టు 14: సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పూర్తి ఎఫ్ఏసీగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యా కమిషనర్ తనపై నమ్మకంతో ఈ కళాశాల అదనపు బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉన్నదన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రశాంతమైన వాతావరణంలో నెలకొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంచి భవిష్యత్ ఉన్నదని, కళాశాల అభివృద్ధి కృషి చేస్తానన్నారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిద్ధులు, అధ్యాపక బృందం డాక్టర్ శకుంతల, మురళీకృష్ణ, సావిద్య, శరవయ్య, మంజుల, రాజిరెడ్డి, స్రవంతి, తారా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

10 శాతం రాయితీతో అద్దెకు ఆర్టీసీ బస్సులు

బొల్లారం, ఆగస్టు 14: డిపాజిట్ లేకుండానే 10 శాతం రాయితీ కల్పిస్తూ అద్దెకు టీజీఎస్ ఆర్టీసీ బస్సులు ఇవ్వనున్నట్లు మియాపూర్ డిపో -2 మేనేజర్ వెంకటేశం తెలిపారు. బుధవారం బొల్లారంలో మాట్లాడుతూ... శ్రావణమాసం సందర్భంగా వివాహాది శుభకార్యాలు, విహారయాత్రల కోసం సెప్టెంబర్ 10వ తేదీ వరకు బస్సులు బుక్ చేసుకున్న వారికి రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఎలాంటి డిపాజిట్ లేకుండానే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులు ప్రైవేట్ వాహనాల కంటే తక్కువ ఖర్చుతో అద్దెకు ఇస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80083 36063, 73828 21471, 80084 30202, 90591 62162 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధ్యానం, ఏకాగ్రతతో అద్భుత ఫలితాలు

మాట్లాడుతున్న మాస్టర్ సాయిలు

సదాశివపేట, ఆగస్టు 14: ధ్యానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని పిరమిడ్ మాస్టర్ బోధన్ సాయిలు అన్నారు. బుధవారం పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ గంటసేపు ధ్యానం చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందని, అలాగే మానసిక ప్రశాంతత కలిగి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. ధ్యానంతో విద్యార్థులు తమ లక్ష్యాలను అవలీలగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో భవిత కళాశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ బాలరాజు, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, రాజు, పిరమిడ్ మాస్టర్ బోయిని కృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మేదపల్లిలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుధాకర్, తదితరులు

ఝరాసంగం, ఆగస్టు 14: గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవో సుధాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని మేదపల్లి గ్రామంలో ఒకరికి డెంగీ నిర్ధారణ అయిందని తెలుసుకొని గ్రామంలో పర్యటించారు. పరిసరాలను పరిశీలించారు. శానిటేషన్ పనులను చేపట్టారు. డెంగ్యూ నిర్ధారణ అయిన వ్యక్తి ఇంటి చుట్టూ దాదాపు 25 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి రమ్య పేర్కొన్నారు.

కలెక్టర్‌కు జాతీయ జెండా అందజేత

కలెక్టర్ వల్లూరు క్రాంతికి జాతీయ జెండాను ఇస్తున్న పోస్టల్ అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 14: కలెక్టర్ వల్లూరు క్రాంతికి పోస్టల్ శాఖ అధికారులు జాతీయ జెండాను అందజేశారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్‌లకు పోస్టల్ శాఖ అధికారులు జాతీయ జెండాలను అందజేశారు. తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి పంపించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలకు సంబంధించిన ఉత్తరాలను అందజేశారు. కార్యక్రమంలో హెడ్‌పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ పరమేశ్వర్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌బీసీఓ ఇన్‌చార్జి రమావత్ సురేశ్, తపాలా సిబ్బంది కామేశ్, రామకృష్ణ, భాస్కర్, విష్ణు పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 14: నారాయణఖేడ్ పట్టణంలోని తహసీల్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్ గ్రౌండ్‌లో ఆర్డీవో అశోక చక్రవర్తితో కలిసి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. జెండావిష్కరణ అనంతరం 10.30 గంటలకు వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కోల్‌కతాలో వైద్య విద్యార్థిని మౌనికపై జరిగిన అఘాయిత్యం, హత్యను నిరసిస్తూ బుధవారం సాయంత్రం సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. - సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 14

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

మాట్లాడుతున్న నాయకుడు బాల్‌రెడ్డి

గుమ్మడిదల, ఆగస్టు 14: వచ్చే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే అధిక స్థానాల్లో విజయం సాధిస్తారని పార్టీ జిల్లా యువనేత కొలన్ బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లవల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పాలనపై ప్రజలు విసుగెత్తారని ఆరోపించారు. ఇప్పటివరకు రైతులకు రైతుబంధు ఇవ్వకపోగా రుణమాఫీతో మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ సరిగా అమలు కావడం లేదని ఆరోపించారు. ఇకనైనా ప్రజా రంజక పాలన సాగించాలన్నారు. కొంత మంది వీడినంతమాత్రాన బీఆర్ఎస్ బలహీనపడదన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని, నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. నల్లవల్లి మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాగిరెడ్డి గూడెం మాజీ సర్పంచ్ హనుమంత్ రెడ్డి, బొల్లారం కౌన్సిలర్ బీరప్పయాదవ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మాట్లాడుతున్న వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 14: వస్తువుల వినియోగంలో మోసాలను గుర్తిస్తే వెంటనే ఫిర్యాదు ఇవ్వాలని వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ సూచించారు. వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయ్‌కుమార్ వస్తువు నాణ్యత, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. మోసాలు జరిగినపుడు ఫిర్యాదు ఇస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాబాయి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ షణ్ముఖం, జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డాక్టర్ కూణ వేణు, వినియోగదారుల క్లబ్ కన్వీనర్ నవ్య, అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ

ఒక విధ్వంసం పుస్తకావిష్కరణ చేస్తున్న పౌరహక్కుల నేత హరగోపాల్ తదితరులు

పటాన్‌చెరు, ఆగస్టు 14: పటాన్‌చెరు కాలుష్యంపై సీనియర్ జర్నలిస్టు చంద్రశేఖర్ శర్మ రాసిన 'ఒక విధ్వంసం' పుస్తకాన్ని పౌరహక్కుల సాధన ఐక్యవేదిక అధ్యక్షుడు, ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్ అమీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకుడు కె.శ్రీనివాస్‌తో కలిసి ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని పూజించే మనిషి నేడు అదే ప్రకృతిని శాసించే దశకు చేరాడని ఆవేదన వ్యక్తం చేశారు. వనరులను యుద్ధప్రాతిపాదికన తవ్వుకొని రేపటితరానికి లేకుండా చేస్తున్నామన్నారు. పటాన్‌చెరు ఫార్మా, కెమికల్ పరిశ్రమలు చేసిన విధ్వంసం మనకు ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయన్నారు. ఒక జర్నలిస్టుగా పటాన్‌చెరు కాలుష్యం గురించి చంద్రశేఖర్‌శర్మ తాను చూసిన విషయాలను 'ఒక విధ్వంసం' పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చాడన్నారు. పుస్తకంలో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలిపాడన్నారు.కార్యక్రమంలో కవుల సరస్వతి, డాక్టర్ విజయ్, రాజ్‌శుక్లా, కె.బాబు రావు, సుధ పాల్గొన్నారు.

ఓయూ పరిధిలో మెరిసిన మానస

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 14: ఇటీవల వెలువడిన సీపీ గేట్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని తాల్క మానస ప్రతిభ చాటింది. ఓయూ పరిధిలో ఎంఎస్సీ బాటనీ ఎంట్రెన్స్ ఫలితాల్లో మూడో ర్యాంకు సాధించింది. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాబాయి, అధ్యాపకులు మానసను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానస ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీనివాస్(ఫైల్)

వట్‌పల్లి, ఆగస్టు 14: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పోతులబోగుడలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోతులబోగుడ గ్రామానికి చెందిన ఎంకొటి శ్రీనివాస్(40)కు 2013లో మమతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు. పుట్టినప్పటి నుంచి వీరి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో అప్పులు చేసి వైద్యం చేయించాడు. అయినా ఇద్దరు అమ్మాయిలు మరణించారు. వారికి అయిన వైద్యం ఖర్చులు రూ.లక్షల్లో కావడంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం విషమించి మృతి చెందాడు. తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిఫాం పంపిణీ

ఎన్‌సీసీ డ్రస్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, ఆగస్టు 14: విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిఫాంలను పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పంపిణీ చేశారు. స్వాంతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్ బాలికల పాఠశాలలో నిర్వహించే మార్చ్‌ఫాస్ట్ కోసం ప్రధానోపాధ్యాయులు స్పందన చౌదరీ సమక్షంలో యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రూ.50 వేలు ప్రోత్సాహకం ఇవ్వగా వాటికి అదనంగా రూ.30 వేలు కలిపి మార్చ్‌ఫాస్ట్ కోసం ఎన్‌సీసీ యూనిఫాంలను అందజేసినట్లు తెలిపారు. పదికి పది జీపీఏ సాధించే విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతి ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం స్పందనచౌదరి, గిరిజా, గౌసోద్దీన్, నర్సింలు, రాఘవేంద్రచారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం లేకుండా హైవే విస్తరణ

వ్యాపార సముదాయాలను పరిశీలిస్తున్న రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ గణపతిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 14: ప్రజలకు, వ్యాపారులకు నష్టం కలగకుండా జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ గణపతిరెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి జాతీయ రహదారిని పరిశీలించారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు చేపడుతున్న ఆరు వరుసల జాతీయ రహదారి విస్తరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పటాన్‌చెరు పట్టణంలో వ్యాపార సంస్థల భవనాలకు, ఇండ్లకు తీవ్ర నష్టం జరుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి వ్యాపారులు తేవడంతో ఎమ్మెల్యే చీఫ్ ఇంజినీర్‌కు విన్నవించారు. రహదారి విస్తరణతో వ్యాపారస్తులకు, స్థానికులకు నష్టం కలగకుండా ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యాపార సముదాయాలు, రోడ్డుకు ఎంత దూరం ఉంది తదితర అంశాలను గణపతిరెడ్డి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ సఫాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, అఫ్జల్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కోహీర్, ఆగస్టు 14: విద్యార్థులకు భోజన సమయంలో అసౌకర్యానికి గురిచేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. విద్యార్థులకు అసౌకర్యం కలిగిస్తున్నారని స్థానికులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం మండలంలోని కవేలి ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల సమయం ముగిసేవరకు తరగతులల్లో ఉండాలని, మధ్యాహ్నం కాగానే ఇంటి దారి పడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, కార్యదర్శి ప్రశాంత్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నకిలీ మద్యం స్వాధీనం

నిందితులను అరెస్ట్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కోహీర్, ఆగస్టు 14: కర్ణాటకలోని బీదర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న నకిలీ మద్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారుల కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(టైడెంట్) చెక్కర పరిశ్రమ వద్ద మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. బీదర్ వైపు నుంచి వచ్చిన కారును సోదా చేయగా అందులో 42 నకిలీ ఫుల్ బాటిళ్లు లభించాయి. రక్షణ శాఖకు సంబంధించిన ఖాళీ సిసాల్లో కల్తీ మద్యం నింపి జహీరాబాద్‌కు తరలిస్తున్న అంబాదాస్, అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. వీటి విలువ దాదాపు రూ.10 లక్షలకు పైనే ఉంటుందని తెలిపారు. వారి నుంచి క్రెటా కారుతోపాటు రెండు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో సీఐలు వీణారెడ్డి, చంద్రశేఖర్, గాంధీనాయక్, ఎస్సై అనిల్‌కుమార్, సిబ్బంది అలీమ్, మాణిక్‌ప్రభు, అనిల్‌కుమార్, రామారావు, సతీశ్, ప్రహ్లాద్, వినయ్, వివేక్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సంగారెడ్డి, ఆగస్టు 14: వసతి గృహాలు, గురుకులాలు, మహాత్మా జ్యోతిబాపూలే హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కోత్లాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పరిసరాలు, వసతిగృహం, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఎవరికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోరా?

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 14: కాంగ్రెస్‌కు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ప్రజల సమస్యలు పట్టవని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని సంజీవన్‌రావుపేట్ ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు పని చేయాల్సి ఉండగా ఇటీవల జరిగిన బదిలీల కారణంగా ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా అందులో ఒకరిని నారాయణఖేడ్ కేజీబీవీ ప్రత్యేకాధికారిగా డిప్యుటేషన్‌పై నియమించారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బదిలీలు, నియామకాలపై అధికారులతో చర్చించి అత్యధిక ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని సుమారు 20 పంచాయతీలకు ప్రత్యేకాధికారులు లేక ఆయా గ్రామాల్లో కనీస సౌకర్యాలు సైతం అందడం లేదన్నారు. నారాయణఖేడ్ ఏరియా దవాఖానలో ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా ఉందంటే నిర్వహణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఒక ఎన్ఆర్ఐ సహకారం కోరుతున్నారంటే ఎమ్మెల్యే పనితీరు ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. రియల్టర్లు, కార్యకర్తల ప్రయోజనం కోసం కాకుండా ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు అభిషేక్ శెట్కార్, ముజామిల్, లాయక్, విఠల్‌రావు, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

హిందువులపై దాడులు అమానుషం

కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు, తదితరులు

రామచంద్రాపురం, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని, హిందువులు దీనిని ఖండించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్సీపురం నగర కార్యవాహ తాళ్లపల్లి అరవింద్ అన్నారు. హిందూ ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ నుంచి పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ హిందూవులందరూ సంఘటితంగా ఉండాలని, బంగ్లాదేశ్‌లో అఘాయిత్యాలు హిందూవులందరికీ కనువిప్పు లాంటిదన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ హనుమంతరావు పాల్గొన్నారు.